

ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 23 పుష్పం : 56-57 20-8-2003

**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 23

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-07-2003, ముక్కామల

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎప్పుడు ఎక్కడ ఏది ఎలా జరగాలో అప్పుడు అక్కడ అది అలా జరుగుతూఉంటుంది. అది ఈశ్వరనిర్ణయం. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే. గోదావరి పుష్కరాల ప్రారంభసమయంలో ముక్కామల గ్రామంలో శ్రీధర్ స్వామీజీ ఆశ్రమంలో జరిగే కార్యక్రమంలో మనం ప్రవచనం ఏర్పాటుచేసుకొన్నాము. వాసవీ కన్యకామాత అగ్నిప్రవేశం చేసిన ప్రదేశం ఇది అని, బ్రహ్మదేవుడు ఇక్కడ యజ్ఞంచేసాడు అని, సుబ్రహ్మణ్యుడు ఇక్కడ తపస్సు చేసాడు అని ముక్కామలక్షేత్రం యొక్క ప్రాముఖ్యత గురించి స్వామీజీ చెప్పారు. ఈక్షేత్రం అభివృద్ధికి స్వామీజీ కృషి చేస్తున్నారు. ఈరోజు మనం ఇక్కడ పుష్కరస్నానం చేసాము. పుష్కరుడు అనేవాడు మహాజ్ఞాని, బ్రహ్మదేవుని కమండలంలో ఉండేవాడు. ఆయనకు జలరూపంలో ఉండేశక్తిని బ్రహ్మదేవుడు ప్రసాదించాడు, పుష్కరుడు మనలను పవిత్రంచేస్తాడు. ఆపుష్కరుడిని ఇమ్మని బృహస్పతి బ్రహ్మదేవుడిని అడిగాడు. పుష్కరుడికి బ్రహ్మదేవుడిని విడిచిపెట్టి రావటం ఇష్టంలేదు. బ్రహ్మదేవుడు ఏమి చెప్పాడు అంటే ఆయనకు రావటం

ఈ సంచికలో......

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


30-7-2003 ముక్కామల ........ 1
05-8-2003 రాజమండ్రి ........ 8




ఇష్టంలేదు, మీరు ఆయన కావాలని అంటున్నారు. అందువలన రాజీమార్గం సూచిస్తాను. ఒక సంవత్సరంలో 12 రోజులు ఆయన మీతో కలసి ఉంటాడు అని బృహస్పతితో బ్రహ్మదేవుడు చెపుతాడు. ఒకరాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు ఒకోనదికి పుష్కరం వస్తూ ఉంటుంది. మనకు ఉన్న 12నదులలో ఒకో సంవత్సరంలో ఒకోనదిలో 12 రోజులు పుష్కరుడు బృహస్పతితో కలిసిఉంటాడు. జలరూపంలో ఉండి, పవిత్రంచేసేశక్తిని పుష్కరుడికి బ్రహ్మదేవుడు ప్రసాదించాడు. అందుచేత ఆ 12 రోజులు ఆనదిలో ఎవరైతే స్నానం చేస్తారో వారు పవిత్రులవుతారు, దోషాలనుండి విముక్తి పొందుతారు. దేహాన్ని, మనస్సును శుద్ధి చేసుకోవటానికి, ఆధ్యాత్మిక వాతావరణం కలుగచేయటానికి ఈపుష్కరస్నానాలు ఏర్పాటు చేసారు. నదిలో ఎక్కడ స్నానం చేసినా ఒక్కటే. ఒకచోట చేస్తే ఎక్కువ పుణ్యం వస్తుంది. అని అనుకొంటారు కాని నదిలో ఎక్కడస్నానం చేసినా పుణ్యంఒక్కటే అందులో సందేహంలేదు. పుష్కరుడు నది అంతటా ఉంటాడు నదిపొడవునా ఉంటాడు అందుచేత మనం ఎక్కడస్నానం చేసినా ఒక్కటేపుణ్యం వస్తుంది. ఆధ్యాత్మిక వాతావరణం పెంచటానికి ఇక్కడ శ్రీధర్ స్వామిజీ కృషి చేస్తున్నారు. మనం స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే లోపలఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి మనస్సు ప్రిపేర్ అవుతుంది. మంత్రం అంటే మననం చేసేవాడిని రక్షించేది మంత్రం. ఎవరికి ఇష్టమైన మంత్రాన్ని వారు శ్రద్దగా, ప్రేమతో జపిస్తూఉంటే జపించేవాడిని ఆమంత్రం రక్షిస్తుంది. జపధ్యానములు మనస్సును పవిత్రంచేస్తాయి, లోపలఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి మనస్సును సిద్ధం చేస్తాయి. మనశరీరం శుద్ధంగా ఉండాలి, మనస్సు శుద్దంగా ఉండాలి, మనస్సు పవిత్రంగా ఉండాలి, ఎంతో కొంత స్వార్థం లేకుండా మనం పనిచేస్తూ ఉండాలి, సామాజికస్పృహకలిగి ఉండాలి. ఇవిఅన్నీ చేయటంవలన ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది అనికాదు, వీటివలన ఆత్మజ్ఞానసముపార్జనకు మన మనస్సు సిద్దమవుతుంది. పుష్కరస్నానం పుణ్యం కలుగజేస్తుంది. పుణ్యం వలన లోచూపు కలుగుతుంది, జ్ఞానం సంపాదించుకోవాలి అనే కాంక్ష మనకు కలుగుతుంది. పుష్కరస్నానం చేసి నీమనస్సును పవిత్రంచేసుకొని, నీబుద్దిని శుద్ధిచేసుకొని ఆత్మజ్ఞాన సముపార్జనకు వాటిని సమాయుక్తం చేసుకోమని పుష్కరుడి సందేశం. ఆత్మజ్ఞానం పొందటానికి కొంత పునాది ఉండాలి, ట్రైనింగ్ ఉండాలి. ట్రైనింగ్ లేకుండా ఇది వస్తుందని చాలామంది అనుకొంటున్నారు. ట్రైనింగ్ లేకుండా సబ్జక్టురాదు, సంస్కారం రాదు. ట్రైనింగ్ లేనివారు భౌతికంగా ఆధ్యాత్మికంగా నష్టపోతారు. పూజ చేయటం వలన, జపం చేయటం వలన తమోగుణం, రజోగుణం తగ్గుతాయి, సత్వగుణం పెరుగుతుంది. మన ఇష్టదేవతకు రోజూ పూజచేస్తున్నాము అనుకోండి, జపం చేస్తున్నాము

అనుకోండి టైముకున్నానం చేస్తాము, అన్నీ టైముప్రకారము చేస్తాము దానివలన తమోగుణం, రజోగుణం తగ్గుతుంది, ప్రకృతిభావన తగ్గుతుంది, దైవభావన పెరుగుతుంది. పూజ, జపం యాంత్రికంగా చేయకూడదు, మనస్సు అక్కడపెట్టి చేయాలి. పూజ, జపం, ధ్యానం ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి సహకరిస్తాయి. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి సత్వగుణం అవసరం. మనం ఇతరులను అనుకరించకూడదు వ్యక్తిగతమైన అభిప్రాయాలను పట్టించుకోకూడదు. ఈరోజు నాతో ఒక ప్రొపెసర్‌గారు ఇలా చెప్పారు. ఆయన పైప్రొఫెసర్‌తో మాట్లాడుతూ ఫలానావారు రోజూ మిమ్మల్ని తిడుతున్నారు అని అన్నారట. ఆయన అన్నాడట వారు ఎంత కాలంతిడతారు, అలా తిడుతూ ఉండనివ్వండి అని అన్నారట. ఇది ఎందుకు చెప్పారు అంటే ఆయనలో ఉన్న సత్వగుణం గురించి చెప్పటానికి ఈవిషయం చెప్పారు. సత్వగుణం వలన సహనం వస్తుంది., సహనం వలన మనకు మేలు జరుగుతుంది, సహనం వలన అంతర్‌దృష్టి కలుగుతుంది, పవిత్రత వస్తుంది, మనస్సు ఆత్మాకారం చెందుతుంది. అందువలన సహనాన్ని పెంచుకొంటూ రావాలి. జరిగిపోయిన గొడవలు రోజూ తలపెట్టుకోవటం వలన నెత్తిమీద బరువు మిగులుతుంది, మీకు అంతర్‌దృష్టి కలుగదు, ఆత్మజ్ఞానం కలుగదు. భూతకాలాన్ని నిరంతరం జ్ఞాపకం పెట్టుకోవటం వలన నీకు పోజిటివ్ తింకింగ్ రాదు, నెగిటివ్‌తింకింగ్ వస్తుంది. చేతిలో ఉన్న వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి, మీక్షేమంనేను కోరుకోవాలి, నాక్షేమం మీరు కోరుకోవాలి. స్నేహం అంటే పరస్పరం ఒకరిక్షేమం ఒకరు కోరుకోవాలి. ఒకరి కష్టసుఖాలలో మరియొకరు భాగం పంచుకోవాలి అది స్నేహం అంటే అంతేగాని ఒకరినాశనం మరియొకరు కోరుకోవటానికి కాదు. పరస్పరం మేలు చేసుకోవటానికే స్నేహాలు. మీరు ఇష్టమైన దేవత యొక్క నామాన్ని జపిస్తూ ఉండాలి, ఆరూపాన్ని ధ్యానం చేస్తూఉండాలి. ఎందుచేతనంటే మనం ఒక రూపానికి, నామానికి పరిమితమై ఉన్నాము కాబట్టి మనం ఏదేవత యొక్క రూపాన్ని ధ్యానిస్తున్నామో, ఏనామాన్ని జపిస్తున్నామో ఆనామరూపములు మన నామరూపముల నుండి మనలను దూరంచేస్తాయి. నది సముద్రంలో కలిసినప్పుడు తన నామరూపాలను పోగొట్టుకొంటుంది. మనం నామబుద్ధిని, రూపబుద్ధిని తగ్గించుకొంటే నది సముద్రంలో కలిసినట్లుగా మనం బ్రహ్మంలో ఐక్యమవుతాము. ఏకమతితోటి, ఏకబుద్ధితోటి పనిచెయ్యటం ఐకమత్యం, శరీరాలు రకరకాలుగా ఉండవచ్చు. కాని ఒకపని చేసేటప్పుడు పదిమంది ఏకమతితోటి, ఏకబుద్ధితోటి చేస్తే అది ఐకమత్యం అని చెప్పారు. ఇంట్లో పదిమందిఉంటే వారు ఐకమత్యంగా ఉంటే లక్ష్మి పెరుగుతుంది, శాంతి పెరుగుతుంది. మీరు శాంతిగా ఉండటమే కాదు ఇతరులు శాంతిగా



1A

ఉండటానికి సహకరిస్తారు. నది ప్రవహిస్తూ ఉంటుంది. 10 నిమిషాలు ఆగు, నావంకచూడు అంటే ఆగదు, చూడదు. సముద్రంలో కలిసేవరకూ దాని ప్రయాణమే ప్రయాణం, దాని వేగమే వేగం. నదీప్రవాహం ఎలాగ ఉంటుందో, భగవంతుడిని పొందటానికి మన చింతనకూడా అలాగ ఉంటే మనకు ఆత్మ జ్ఞానం కలుగుతుంది. మనకు అనన్య చింతన రాలేదు, ఇతర చింతనలు లేకపోతే పరమేశ్వరునిపై అనన్య చింతన ఉంటుంది. ఇతరచింతలు లేకుండా ఎవరైతే నిరంతరం సర్వకాల సర్వావస్థలలో నన్ను స్మరిస్తున్నారో, నన్ను పూజిస్తున్నారో, నాకోసమే జీవిస్తున్నారో వారి యోగక్షేమములు నేను చూడకపోతే ఎవరుచూస్తారు, వారి బాధ్యత నాదే అన్నాడు భగవంతుడు. మన మనస్సులో ఏమిఉందో మనకు తెలుస్తుంది. అది ఏవెలుగులో మనకు తెలుస్తుంది. లోపల పరమాత్మ ఉన్నాడు పరమాత్మ ప్రసాదించిన వెలుగులో మనమనస్సులో ఏమి ఉందో మనకు తెలుస్తోంది. మన మనస్సులో ఏగుణం ఉందో ఆగుణంతో పరమాత్మ కలవడు, ఆయన వెలుతురును పంపినీమనస్సులో ఫలానా గుణం ఉంది అని నీకు చూపిస్తాడు, వాడు ఈశ్వరుడు. నీలోపల ఏమిఉందో ఆయన చూపిస్తూఉంటాడు, ఎలా అభివృద్ధి పొందాలో నీకు ఉపదేశిస్తూ ఉంటాడు. ఆలోపలనుండి వచ్చే ఉపదేశం మనకు అర్థం కాకపోతే లోపల ఏవో సంఘటనలు క్రియేట్‌చేసి, ఆసంఘటనల ద్వారా మనకు పాఠాలు నేర్పి ఆయన ఏహృదయంలో అయితే ఉన్నాడో అక్కడకు గుంజుకోవటానికి చూస్తాడు, వాడు గురువు. గురువు జ్ఞానప్రదాత. లోకంలోని సంఘటనల ప్రభావం నీమనస్సు మీద పడనివ్వడు, అది గురువు యొక్క దయ.

జ్ఞాని మూడు అవస్థలకు ఆధారంగా ఉంటాడు, వాటికి అతీతంగా ఉంటాడు, ఇవి నిజంకాదు అని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. జాగ్రదవస్థ, సప్నావస్థ, షుషప్తి ఇవి మూడూ నిజంకాదు తెరమీద బొమ్మలు కల్పించినట్లు బ్రహ్మంయందు ఇవికల్పించబడ్డాయి. తెరనిజం కాని బొమ్మలు నిజంకాదు అలాగే ఈకల్పించబడినవి నిజంకాదు, కాని ఈకల్పించబడిన వస్తువులకు ఏది ఆధారంగా ఉందో అది నిజం. నీవు దానితో తాదాప్యం పొందినప్పుడు ఇవి అన్నీ కల్పించబడ్డాయి అని నీకు తెలుస్తుంది. అందుచేత మనం ఏదిగా ఉన్నామో దానితో తాదాప్యంకలిగే వరకూ మనం కానిదానిని అవును అని ప్రతీజ్ఞన్నలోనూ అనుకొంటూనే ఉంటాము. ఒకటి గుర్తుపెట్టుకోండి వ్యక్తిగతమైన భావాలకు ఎప్పుడూ ప్రాముఖ్యత ఇవ్వవద్దు. వ్యక్తి రాగద్వేషములతో ఉంటాడు. ఆమోహంలో పడ్డామా జ్ఞానమనే ఒడ్డుకు రాలేము, వాటి మధ్యలోనే తిరుగుతూ ఉంటాము. వ్యక్తిగతమైన భావాలను నీవు ఆధారంగా చేసుకోవద్దు

శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో. సాధన పేరుచెప్పి కొంతమంది స్వార్దం పెంచుకొంటూ ఉంటారు. వారికి ఆత్మజ్ఞానం కలగటం లేదు అంటే అక్కడ స్వార్ధంకారణం. లోపలఉన్న బ్రహ్మంగురించి ఉపనిషత్ ఏమని చెప్పింది అంటే సత్యం, జ్ఞానం, అనంతం, ఆనందం అని చెప్పింది. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఉండేదేసత్యం. జ్ఞానం అంటే నీవు ఏదిగా ఉన్నావో దానితో తాదాప్యంపొందితే అది జ్ఞానం అంతేగాని ఇన్‌ఫర్‌మేషన్ జ్ఞానం కాదు. అసలు జ్ఞానసముపార్జనపట్ల మనకు కాంక్షలేదు. నోములు, వ్రతాలు, పూజలు ఇవి అన్నీ పెద్దలు ఎందుకు పెట్టారు అంటే జ్ఞానసముపార్జనకు మనబుద్దిని సిద్దంచేయటానికి ఇవిఅన్నీ ఏర్పాటుచేసారు. గురువు దగ్గరకు వెళ్ళినప్పడు మనం నేర్చుకోవటానికి వెళ్ళాలి అంతేగాని గౌరవాలకోసం వెళ్ళకూడదు. జ్ఞానంకావాలంటే నీవు జ్ఞానిని ఆశ్రయించు అని భగవంతుడు చెప్పాడు. ఇంతకుముందు ముక్కామలలో ఎవరోవచ్చి కలిసినాన్నగారు మీ దయవలన మాకు ఈ ఉపకారం జరిగింది అని చెపుతున్నారు. నాకు ఆశ్చర్యం వేసింది నేను ఎవడిని చేయటానికి, లోపల ఈశ్వరుడు అలా అనిపింపచేసాడు. ఎందుకు చేసాడు అంటే నేను మీక్షేమాన్ని హృదయపూర్వకంగా కోరుకొంటున్నాను కాబట్టి ఈశ్వరుడే ఆపనిచేసి నీకు నాన్నగారిద్వారా ఆపనిజరిగింది అని చెపుతున్నాడు. ఈఉపకారాలు అన్నీ నాశవం చేస్తోందా? లేదు. చేసేది ఈశ్వరుడే. వారిక్షేమం కోరటంలో నాబుద్దిలో దోషంలేదుకాబట్టి ఆయన ఉపకారం చేసిగౌరవం నాకు ఇచ్చాడు, అది ఈశ్వరుడి ప్రణాళిక. భావదారిద్ర్యం పనికిరాదు. భావశుద్ది లేకుండా ఆత్మజ్ఞానం కలిగే సమస్యేలేదు. భావశుద్ది ఆత్మజ్ఞానానికి దారి చూపిస్తుంది. జపం చేయటానికి అయినా, ధ్యానం చేయటానికి అయినా మనస్సు ఉండాలి, ఎందుకు చేయటం అంటే మనస్సు పవిత్రం అవ్వటం కోసం. ఇప్పడు ఇక్కడ స్నానం చేయాలనే తలంపు ఎవరికి వచ్చింది? మనస్సుకు వచ్చింది. మనస్సు ఉంటేనే ఇది అంతా, మనస్సు లేకపోతే ఏదీలేదు. మనోనాశనం పొందినవాడు జననమరణములకు అతీతంగా ఉంటాడు, సంసారచక్రంలోనుండి విడుదల పొందుతాడు, శాశ్వతశాంతిని పొందుతాడు. మీరు నూటికి నూరు పాళ్ళు మంచిపనులు చేసినా విమర్శించేవారు చాలామంది ఉంటారు, దానికి కారణం అసూయ. మీరు చేసే మంచిపనులకు అందరూ సంతోషిస్తున్నారు అనుకొంటున్నారు కాని కొంతమందే సంతోషిస్తున్నారు అని ఈమధ్య నాదగ్గర ఎవరో చెపుతున్నారు. ఆకొంతమంది సంతోషించాలి అని కూడా నేను అనుకోవటం లేదు, అని చెప్పాను. ఈశ్వరుడి ప్రీత్యర్థం చేస్తున్నాను, ఆసంతోషించేవారు కూడా నాకు మోక్షం ఇవ్వరు, మోక్షంఇచ్చేవాడు అంతర్యామిగా ఉన్నాడు, వాడు ఈశ్వరుడు, ఆయన సంతోషిస్తే సరిపోతుంది. అందరూ





సంతోషించాలి అని మీరు ఏపనిచేయవద్దు. అందరూ గౌరవించాలి, అందరూ సంతోషించాలి అని అనుకోవటం చివరకు మానసిక అనారోగ్యానికి దారితీస్తుంది. నిన్ను నీవు ఉద్దరించుకోవటానికి పనులు చెయ్యి. ఎవరో వచ్చి ఉద్దరిస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు. నీమీద ఇష్టంలేనివారు నీ ఆత్మవిశ్వాసాన్ని చెడగొట్టటానికి చూస్తారు, ఆమాటలు పట్టించుకోవద్దు. నీమనస్సుకు ధైర్యంనేర్పు. ధైర్యముతో, ఓర్పుతో నిన్ను నీవు ఉద్దరించుకోవటానికి ప్రయత్నంచెయ్యి.

సంకల్పానికి కూడా బలం ఉంది అది గుర్తుపెట్టుకోండి. భౌతికంగా మీరు ఎవరికైనా సహాయం చేయలేకపోవచ్చు. వారు అభివృద్దిలోనికి రావాలి, వారికి జ్ఞానం కలగాలి, వారు బాగుపడాలి అని మనస్సులో అనుకొంటారు అనుకోండి, ఆసంకల్పం యొక్క ప్రభావం కూడా వారి మీద పనిచేస్తుంది. మనకు చేతనైతే ఎవరికైనా ఉపకారం చేయాలి, లేకపోతే ఊరక ఉండాలి అంతేగాని అపకారం మటుకు చేయకూడదు. మనం ఏదిచేస్తే రాబోయే జన్మలో అదే మనకు ఎదురువస్తుంది. భగవాన్ దగ్గరకు అనేకమంది వచ్చి జపం గురించి, ధ్యానం గురించి, యజ్ఞం గురించి చెప్పేవారు కాని సృష్టిలో ఏదీ కూడా నామనస్సును ఆకర్షించలేదు అని చెప్పారు. ఎందుచేత ఆకర్షణ కలుగలేదో చెప్పండి. ఆయన ఏదిగా ఉన్నాడో అది అయ్యి ఉన్నాడు, దాని తాలుక అనుభవం పొంది ఉన్నాడు కాబట్టి సృష్టిలో దేనిమీద ఆకర్షణ కలుగలేదు ఆయన సహజస్థితిని పొంది ఉన్నాడు. ఎప్పడైతే సహజస్థితి వచ్చిందో అప్పడు భగవంతుడు ఆశరీరాన్ని స్వాధీనంచేసుకొంటాడు, ఆశరీరం ద్వారా ఆయన పనిచేస్తాడు. భక్తులలో కూడా కొంతమంది తింగరతనంగా ఉంటారు. ఈమధ్య ఒకరు చెపుతున్నారు. వారి ఇంట్లో కృష్ణుడు మురళీతో ఉన్న విగ్రహం ఉంది అట. ఆవిగ్రహం తీసి వేయండి, ఆయన మురళీ ఊదినట్లుగా మీ ఇంట్లో ఉన్నది అంతా ఊదేస్తాడు, ఇంక మీకు ఏమీ మిగలదు, ఆవిగ్రహాన్ని వెంటనే తీసేయండి అని ఎవరో చెప్పారట. అది నెగిటివ్ తింకింగ్. కొంతమంది ఉంటారు వారికి ఎంతసేపు నెగిటివ్ తింకింగే, మీరు మంచిచెప్పినా దానిని చెడ్డ క్రింద తీసుకొంటారు. వారు సుఖపడరు, మనలను సుఖపడనివ్వరు. మురళి ఖాళీగా ఉంటుంది కదా మురళి ఏవిధంగా అయితే ఖాళీగా ఉందో అలాగ నీహృదయంఖాళీఅయితే మనలను మురళిక్రింద ఉపయోగించుకొంటాడు అంటే కృష్ణుడు చేతిలో మురళి అయిపోతాము, మనశరీరాన్ని ఆయన స్వాధీనం చేసుకొని ఆశరీరంద్వారా పనిచేస్తాడు అది అర్ధంకాక, దానిని తిరగేసి చెపుతున్నారు. బాహ్యాశత్రువులు మనలను అభివృద్దిలోనికి

రానివ్వరు. బాహ్యశత్రువులకంటే లోపలశత్రువులు ఇంకా ఎక్కువ ప్రమాదం, వారుకూడా మనలను అభివృద్ధిలోనికి రానివ్వరు. జపధ్యానములు చేస్తూ, సత్పురుషుల సహవాసం చేస్తూ ధైర్యంపెంచుకొని, బుద్ధిని సంస్కరించుకొని, ఆత్మవిశ్వాసం పెంచుకొని లోపలశత్రువులను బయటశత్రువులను జయించుకొంటూ వస్తేగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మీరు ఎప్పుడైతే సాధనలో ఉన్నారో, మీ సాధనా బలం పెంచటానికి ఈశ్వరుడు కొన్ని సంఘటనలు క్రియేట్ చేస్తాడు. మీకు ఎంత ధైర్యం ఉందో చూస్తాడు, మీలో భయం ఉంటే తొలగిస్తాడు, వివేకం పెంచుతాడు, లోపలశత్రువులను, బయటశత్రువులను ఎదుర్కొనే శక్తిని ప్రసాదిస్తాడు, చివరకు మీకు ఆత్మజ్ఞానాన్ని ఇస్తాడు, వాడే ఈశ్వరుడు. నీమనస్సును శోధించకుండా, ఈమనస్సు ఎవరు అని దానిని విచారణ చేయకుండా, దానిని విశ్లేషణ చేయకుండా నీకు చిత్తశుద్ధి కలుగదు. శరీరం మరణించాక నీకూడా ప్రయాణించేది నీమనస్సే. అందువలన ఈ మనస్సు ఎవరో తెలుసుకొని దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యి. జ్ఞానం పొందటానికి అడ్డువచ్చేది కూడా మనస్సే. నీమనస్సును నాకు ఇచ్చేస్తే నాస్వరూపాన్ని నీకు ఇస్తాను అని భగవంతుడు చెప్పాడు. చిత్తాన్ని శోధించటం వలన నీకు ముక్తి కలుగుతుంది. రహస్యం అంతా మనస్సులోనే ఉంది. మనస్సును శత్రువుగా చేసుకోవద్దు, దానిని మిత్రుడుగా చేసుకో. మనస్సును మిత్రుడిగా చేసుకొంటే అది నీకు ఉపకారంచేస్తుంది. జపం చేయగా చేయగా అజపస్థితి వస్తుంది. మీరు కొంతకాలం ప్రయత్నం చేయగా చేయగా ప్రయత్నంలేని స్థితిని పొందుతారు. అప్పుడు మీప్రయత్నంతో సంబంధం లేకుండానే ప్రయాణం సాగిపోతుంది. మనంకొంత సాధన చేసాక హృదయంలో నుండి ఆకర్షణ వస్తుంది. అప్పుడు ఇంక నీ సాధనతో పనిలేదు, ఆప్రవాహంలో కొట్టుకొనిపోతావు, హృదయగుహలో పడిపోతావు. అయితే కళ్యాణగుణాలు పెంచుకోవాలి. లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి రావటానికి కళ్యాణగుణాలు సహకరిస్తాయి. లౌకిక ప్రేమలు నిజం అనుకోవద్దు, వాటికిలోతు ఉండదు. ఈశ్వరుడికంటే మనలను ప్రేమించేవారు ఎవరూ లేరు. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు. ఈగౌరవాలు, దేహాభిమానం త్యాగం చేయకుండా మనకు జ్ఞానంరాదు. త్యాగం అంటే నీవు కానిదానిలో నుండి నీవు విడిపోతూ ఉండాలి. నీవు కానిదానిలో నుండి నీవు విడిపోతూ ఉంటేనే గాని నీవు ఏదైతే అవునో అందులో ఐక్యం అవ్వలేవు. నీవు కానిదానిని అవును అనుకొన్నంతకాలం నీవు ఏదైతే అవునో అది నీకు తెలియదు, నీకు అనుభవంలోనికి రాదు. పూజ, జపం, ధ్యానం వలన తమోగుణం తగ్గుతుంది. రజోగుణంతగ్గుతుంది. సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం వలన సహనం వస్తుంది. సహనం మనకు కీడు చెయ్యదు,



మేలు చేస్తుంది, జ్ఞానం పొందటానికి మనకు సహకరిస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-08-2003, రాజమండ్రి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు మనం పుష్కర స్నానాలు చేస్తున్నాము. ఎందుకు చేస్తున్నాము? పుష్కరుడు మనలను పవిత్రం చేస్తాడు, దోషాలనుండి విడుదల పొందుతాము అనుకొంటున్నాము. అందువలననే స్నానం చేస్తున్నాము. ఇది మంచిదే, ఇది భౌతికమైన విషయం. మనం గోదావరిలో, గంగలో ఎలా స్నానం చేస్తున్నామో అలాగ మన హృదయంలో ఉన్న జ్ఞానగంగలో, ప్రేమగంగలో, ఆనందగంగలో స్నానం చెయ్యగలగాలి. మనలోపలఉన్న గంగలో స్నానం చెయ్యటానికే ఈగోదావరినదిలో స్నానం చేయటం. ఆనందం ఎక్కడఉంది? ఆనందం మన హృదయంలో ఉంది, బయట ఏవస్తువులోను ఆనందం లేదు. మనం కొంతమంది స్నేహితులను, ఇంట్లోవారిని ప్రేమిస్తూ ఉంటాము. ఆ ప్రేమించటం కూడా వారికోసం కాదు, వారిని ప్రేమించటం వలన మనకు ఒక సంతృప్తి కలుగుతుంది, ఆనందం కలుగుతుంది. సమాజంలో ఎవరైనా మనుషులను ప్రేమించినా, కుటుంబసభ్యులను ప్రేమించినా మన కోసమే వారిని ప్రేమిస్తున్నాము. మనం ఏదైనా ఒక మంచి పని చేసాము అనుకోండి, దాని వలన మనకు సంతృప్తి కలుగుతుంది. ఆ సంతృప్తి కలగటం కోసం మనం ఆపనిని చేస్తున్నాము. అక్కడ ఆపనికంటే, ఆపని చేయటం వలన వచ్చే ఆనందం మనకు ముఖ్యం. అంటే ఆ పనికూడా మన కోసమే చేస్తున్నాము, మన ఆనందం కోసమేచేస్తున్నాము. ఒక మహాత్ముడు ఏమిచెప్పాడు అంటే మీరు ఏపని చేసినా ఆడంబరంకోసం చేయవద్దు, గొప్పలకోసం చేయవద్దు, నిరాడంబరంగా, నిరహంకారంగా చెయ్యండి. అలా పనిచేస్తే పరలోకంలో మీకు భగవంతుడు స్వయంగా స్వాగతం చెపుతాడు. మీరు ఇక్కడ గొప్పలకోసం, ముచ్చట్లకోసం ఆడంబరంగా మంచి పనులు చేస్తే ఇక్కడ ముచ్చట్లు వస్తాయి, గౌరవాలు వస్తాయి కాని పరలోకంలో భగవంతుడు మటుకు మీకు స్వాగతం చెప్పడు అని చెప్పారు. అంటే ఇక్కడ మనంచేసే పనిముఖ్యంకాదు. మనం ఏ ఉద్దేశ్యంతో ఆపని చేస్తున్నామో భగవంతుడు చూస్తాడు. ఈశ్వరుడు అంతటా ఉన్నాడు, మనలో అంతర్యామిగా కూడా ఉన్నాడు. ఆయనే మనకు ప్రభువు, యజమాని. ఆయన ప్రీతికోసం మనం పనులు చేస్తే మనకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. అందుచేత మనం జీవితంలో మెలుకువగా ఉండవలసింది ఏమిటి అంటే ప్రియం, అప్రియం వీటిని తగ్గించుకోవాలి. ప్రియం ఉన్నచోట కోరిక ఉంటుంది.

అప్రియం ఉన్నచోట కోపం ఉంటుంది. మనకు ఎవరిమీద అయినా ఇష్టం లేదు అనుకోండి వారి మీద వెంటనే కోపంవచ్చేస్తుంది. ఎవరి మీద అయినా ప్రియంగా ఉంటే వారిని బాగుచెయ్యాలి, వారికి ఏదో చెయ్యాలి అనే కోరిక కలుగుతుంది. నీకు ప్రియం ఉన్నా, అప్రియం ఉన్నాకూడా మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది. ప్రియం, అప్రియం అంటే రాగద్వేషాలు. ప్రియం, అప్రియం వీటిని తగ్గించుకొంటే మనస్సు పల్చబడుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది. కోరిక, కోపం వీటిలోనుండి మనం విడుదలపొందాలి. భగవంతుని మీద నీకు పూర్ణశరణాగతి కలిగితే ఇంక నీకు దుఃఖం వచ్చే అవకాశమేలేదు. మనం ప్రతీదీ నేను చేసాను, నేను చేసాను అనుకొంటూ ఉంటాము. ఇలా నేను చేసాను, నేను చేసాను అని అనుకోవటం వలన కర్మచుట్టుకొంటుంది, పునర్జన్మలు పెరుగుతాయి, మనం నేను, నేను అని ఎక్కడయితే అంటున్నామో ఆస్థానంలో భగవంతుడిని పెట్టాలి. చేయించేదిభగవంతుడే, మనం బొమ్మలం మాత్రమే. మనం ఏదైనా ఒక మంచిపని చేసాము అనుకోండి అదిమనం చేసిందికాదు, భగవంతుడే మన శరీరాన్ని ఉపయోగించుకొని ఆపనిచేసాడు, ఇదంతా నేను చేసాను అనుకొంటే పునర్జన్మలు పెరుగుతాయి. నేను కాదు ఇదంతా నువ్వే అని భగవంతుడిపట్ల శరణాగతిచేస్తే, కర్తనేను కాదు కర్త భగవంతుడే అని అనుకొంటే పునర్జన్మలు తగ్గిపోతాయి ఇది మనం గుర్తుపెట్టుకోవాలి. మీరు తొందరపడవద్దు. మీకు అందరకూ ఆత్మజ్ఞానం కలుగుతుంది. కాని ఒకటి గుర్తుపెట్టుకోవాలి ఆనందం బయటలేదు, నీలోపలే ఆనందం ఉంది. మీ చేతిలో అధికారం ఉంది అనుకోండి, మీకు ధనం ఉంది అనుకోండి, మీకు కీర్తిఉంది అనుకోండి, మీకు వెయ్యిమంది నౌకరులు ఉన్నారు అనుకోండి ఎన్ని ఉన్నామీకు ఆనందం కలుగదు. దేహాభిమానం ఎవరికైతే తగ్గిందో, దేహంతో తాదాప్యం పొందే తలంపు ఎవరికైతే నశించిందో వారికి మాత్రమే ఆనందం, శాంతి, జ్ఞానం స్వరూపంగా వ్యక్తమవుతుంది. బాహ్యవిషయాలు అంతాస్వప్నమే. నీకు ధనంవచ్చినా, చదువు వచ్చినా, కీర్తివచ్చినా, అధికారం వచ్చినా దేహప్రారబ్ధంలో ఉంటే అది వస్తుంది అంతే, అదంతా స్వప్నమే. ఎవరికి ఉత్తమసుఖం వస్తుంది, ఎవరికి దుఃఖమిశ్రితం లేని సుఖం వస్తుంది అని భగవంతుడు చెప్పాడు అంటే ప్రశాంత మనసం అన్నాడు అంటే శాంతచిత్తం కలిగిఉండాలి అప్పడు ఉత్తమసుఖం మనకు అందుతుంది. మీదేహప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి మంచిసంఘటనలు, ఒకోసారి చెడు సంఘటనలు ఎదురు వస్తాయి, వాటిని చూసి మీరు కంగారు పడవద్దు. మీరు ప్రోపర్‌గా సబ్జక్టును అర్థం చేసుకొంటే మనం వర్రీ పడవలసిన విషయం అంటూ ఏమీలేదు. మనం

20-08-2003



వర్రీపడుతున్నాము అంటే మనగురించి మనకు తెలియటంలేదు అని అర్థం, మనహృదయంలో ఏమి ఉందో మనకు తెలియటంలేదు. మనం అన్నీ తెలుసుకొంటున్నాము కాని మన గురించి మనం తెలుసుకోవటంలేదు. ఎంతకాలమయితే మన గురించి మనం తెలుసుకోమో అంతవరకు మనకు ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. ఇక్కడ మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే అంతాస్వప్నమే, జీవితంలో ఏ సంఘటనలు జరిగినా అంతా స్వప్న సమానము. జీవలక్షణాలు ఉన్నవాడికి పునర్జన్మ వచ్చి తీరుతుంది మనోనాశనం అయ్యేవరకు శరీరాలు వస్తూనే ఉంటాయి, మనం శవాలను మోస్తూనే ఉండాలి. మనం చేసింది వూరికే పోదు, మంచిచేసినవాడికి దుర్గతి లేదు అని భగవంతుడు చెప్పాడు. మనం న్యూస్‌పేపరులో చెప్పినమాటలు నమ్ముతాము గాని భగవంతుడు చెప్పిన మాటయందు మనకు విశ్వాసంలేదు. మనందరం ఎంతోకొంత సాధన చేస్తున్నాము. కాని భగవంతుడి పట్ల ఎంత విశ్వాసం ఉండాలో అంతవిశ్వాసం మనకు లేదు, ఈశ్వరుడిపట్ల సజీవమైన విశ్వాసం మనకు లేదు. ఏదో కొద్దిగా విశ్వాసం ఉంది అది మరల ప్రకృతిగుణాలవలన చెదిరిపోతూఉంటుంది. మనం జీవితం పొడుగునా, మనం ఏదైతేకాదో దానితో తాదాప్యం పొందటానికి అలవాటుపడ్డాము, ఆతాదాప్యం విడిచిపెట్టటమే త్యాగం. నేను ఏదైతేకాదో దానిలోనుండి వేరుపడటమే త్యాగం. మనిషిలో కపటం ఉండకూడదు, మాట, మనస్సు, చేత నిదానంగా ఉండాలి. మనస్సులో కపటం ఉన్నవాడికి ఆత్మజ్ఞానం ఎలాకలుగుతుంది. వాడు ఏమతంలో ఉన్నా, ఏకులంలో ఉన్నా కపటికి ఆత్మజ్ఞానంకలుగదు. అందుచేత అంతఃకరణశుద్ధి చాలా ముఖ్యం. మనం రోడ్డు మీద ప్రయాణం చేస్తూ ఉంటే ప్రక్కన మురికిగుంటలు ఉంటే ఏమిటి ఈ మురికిగుంటలు, వీటిని ఎవరూ పట్టించుకోవటంలేదు ఏమిటి అనుకొంటాము, మురికిగుంటలు చూసి అసహ్యించుకొంటాము. కాని మన మనస్సులో ఎన్ని మురికిగుంటలు ఉన్నాయో మనకు తెలియటం లేదు. సోదర మహాశయులారా ఒక్క విషయం మీరు గుర్తుపెట్టుకోండి. రోడ్డుప్రక్కన మురికిగుంటలు కంటే, మన ఇంటిప్రక్కన ఉన్న మురికిగుంటలు కంటే మనమనస్సులో ఉన్న మురికిగుంటలు చాలా ప్రమాదం. రోడ్డుప్రక్కన ఉన్నమురికిగుంటల వలన మనశరీరానికి అనారోగ్యం రావచ్చు, అవి మనశరీరానికి చావు తీసుకొనిరావచ్చు కాని మన మనస్సులో ఉన్న మురికిగుంటలు వలన లక్షలాది జన్మలకు యిక్కడ బీజాలు పడిపోతాయి, వాసనలు పడిపోతాయి. రోడ్డుప్రక్కన ఉన్న మురికిగుంటలను చూసి మనంరోత పడుతున్నాము కాని మన మనస్సులో ఉన్న మురికిగుంటలను చూసి మనం రోత పడటంలేదు.

**రమణ భాస్కర**

మనకు రజోగుణం ఉంది, తమోగుణం ఉంది. వీటిని లోపల దాచుకొంటున్నాము, పైకి మనకు సత్వగుణం ఉన్నట్లు కనిపిస్తున్నాము. రజోగుణం ఉన్నవాడికి జపంకుదరదు, ధ్యానం కుదరదు. మనసాధనకు ఏవిషయాలు అయితే అడ్డువస్తున్నాయో అవేమనకు జ్ఞాపకం వస్తూఉంటాయి, అది రజోగుణలక్షణం, తమోగుణలక్షణం. అందుచేత రజోగుణం, తమోగుణం తగ్గించుకోవాలి. నేను మిమ్మల్ని విమర్శిస్తాను అనుకోండి, మీరు బాగా ఉద్రేకపడిపోతారు. నేను మిమ్మల్ని స్తోత్రం చేస్తాను అనుకోండి, మీరు బాగా ఉబ్బిపోతారు. ఇవి అన్నీ జీవలక్షణాలు. మనం జీవలక్షణాలను పెట్టుకొని పరమాత్మను పొందుదామని అంటే అదిసాధ్యంకాదు మనం జీవలక్షణాలను తగ్గించుకోవాలి. జీవలక్షణాలను తగ్గించుకోవటానికే సత్పురుషులతో సహవాసం, మహాత్ములతో సహవాసం. బ్రహ్మం మన హృదయంలోనే ఉంది. మనకు అంతర్దృష్టిలేదు అందువలన అది మనకు తెలియటంలేదు. అంతఃకరణశుద్ధి లేనివాడికి, ఆహారశుద్ధి లేనివాడికి అంతర్దృష్టికలుగదు. అంతర్దృష్టి లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. హృదయంలో ఉన్నసత్యం మనకు గోచరమయ్యే వరకు ప్రకృతి మనలను విడిచిపెట్టదు, పునర్జన్మ మనలను విడిచిపెట్టదు. ముఖ్యంగా మనం సత్వగుణాన్ని ప్రాక్టీసు చేసుకొంటూరావాలి. అభ్యాసం చేయకుండా ఏదీరాదు. మన హృదయంలో ఉన్న సత్యం చాలా సింపుల్‌గా ఉంటుంది, నిరాడంబరంగా ఉంటుంది. దైనందిన జీవితంలో మనం ఆడంబరంలేకుండాఉంటే, సింపుల్‌గా ఉంటే హృదయంలో ఉన్న సత్యం తానుగా మనకు గోచరిస్తుంది. మనం అందరము చేసే పొరపాటు ఏమిటి అంటే మనం కాని దేహంతోటి మనంకాని మనస్సు తోటి తాదాప్యం పొందుతున్నాము. గాఢనిద్రలో మనందేహంతో విడిపోతున్నాము, మనస్సుతో విడిపోతున్నాము కాని గాఢనిద్రలో మనం లేమా అంటే మనం ఉన్నాము, సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. గాఢనిద్రలో మనం సత్యానికి దగ్గరగా ఉన్నాము. జాగ్రదవస్థలో మనం దేహంతోటి, మనస్సుతోటి తాదాప్యం పొందుతున్నాము. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతోంది. ఇక్కడ సబ్జక్టు బాగా అర్థంచేసుకోండి. అర్థంలేని చదువులు వ్యర్థం, తొందరేమీ లేదు. మీరు నల్లగా ఉన్నారు అంటే మీకు దుఃఖంవస్తుంది. మీ శరీరం నల్లగా ఉంది దానితో మీరు తాదాప్యం పొందటం వలన మీకు దుఃఖం వస్తోంది. నల్లగా ఉంటే ఇబ్బంది ఏమీలేదు. మీకు ఉన్న నలుపుతో మీరుతాదాప్యం పొందకుండా ఉంటారు అనుకోండి, నేను మిమ్మల్ని నల్లగా ఉన్నారు అన్నా మీకు దుఃఖంరాదు. మీరు లావుగా ఉన్నారు అనుకోండి బొండంగా ఉన్నారు అంటే వెంటనే మీకు దుఃఖం వచ్చేస్తుంది. శరీరం బొండంగా ఉంది. లోపలఉన్న వస్తువు బొండంగా లేదు. వాడికి శరీరంతో ఉన్న





తాదాప్యం వలన దుఃఖం వస్తోంది. ఇది బాగా అర్థంచేసుకోండి. అక్కడ శరీరం వాడి దు:ఖానికి కారణంకాదు, బొండం అనేది నలుపు అనేది వాడి దుఃఖానికి కారణంకాదు. ఆనలుపుతో ఎవడైతే తాదాప్యం పొందుతున్నాడో వాడు దుఃఖపడుతున్నాడు కాని శరీరం దుఃఖపడటంలేదు. మీలో ఎవరైనా పేదవారు ఉన్నారు అనుకోండి మీరు పేదవారు అంటే వాడికి దుఃఖం వస్తుంది. పేదరికం వలన దుఃఖంరాదు, ఆపేదరికంతో తాదాప్యంవలన దు:ఖంవస్తుంది. ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే మీరు రియాక్టు అవుతారు. మీరు రియాక్టు అవ్వటం మానేయండి, దుఃఖం ఈక్షణంలో పోతుంది. సాధనచేసిన తరువాత కాదు, శాస్త్రాలు చదివిన తరువాత కాదు, మీరు రియాక్టు అవ్వటం మానివేస్తే ఇప్పడే ఇక్కడే దుఃఖం చల్లారిపోతుంది. మీరులోకంలో జరిగే సంఘటనల వలన, ప్రకృతివిషయాల వలన ఓవర్‌గా రియాక్టు అవుతున్నారు. మనిషిజీవితంలో బాహ్యంగా ఏవో సంఘటనలు జరుగుతూ ఉంటాయి. మంచిజరగవచ్చు, చెడుజరగవచ్చు. మనం ట్రైనింగ్ పొందటానికి ఈభూమిమీదకు వచ్చాము. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిపొందటానికి భగవంతుడు కొన్ని సన్నివేశాలు క్రియేట్‌చేస్తూ ఉంటాడు, అప్పడు ఎలా రియాక్టు అవుతున్నామో భగవంతుడు చూస్తూ ఉంటాడు. మనం ఓవర్‌గా రియాక్టు అవుతున్నాము అనుకోండి ఇంకా పచ్చిగా ఉన్నాడు, ముగ్గలేదు అనుకొని మరల ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. ప్రపంచంలో ఏసంఘటనలోను, విషయంలోను దు:ఖంలేదు. ఇది గుర్తు పెట్టుకోండి. ఆసంఘటనకు మీరు రియాక్టు అవ్వటంతో మీకు దుఃఖం వస్తోంది, రియాక్టు అవ్వకపోతే దుఃఖంలేదు. రియాక్షన్ అణిగిపోయిన క్షణంలో మీ సాధనతో నిమిత్తం లేకుండా దుఖం ఆరిపోతుంది. ఇప్పడు మనం అందరం అహంవృత్తిలో ఉన్నాము. పొట్టకోసం మీరు ఏవృత్తిచేసుకొన్నా ఇబ్బందిలేదు కాని అహంవృత్తిలో మటుకు ఉండకండి అని భగవాన్ అంటూఉండేవారు. గాఢనిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది. ఆతలంపు రాగానే దేహంతో తాదాప్యం పొందుతుంది. అదే ప్రథమతలంపు అదే సైతాను. ఈనేను అనే తలంపు నీకు లోపల నుండే వస్తోంది. అది ఎక్కడ నుండి ఉదయించి వస్తోందో ఆహృదయంలో దానిని స్థిరంగా ఉంచగలిగితే అది నశిస్తుంది. అక్కడ ఉన్న సత్యంనీకు స్వరూపంగా గోచరిస్తుంది. ఆస్థితికి నీవు చేరుకొంటే చావు పుట్టుకలకు సంబంధించిన తలంపులుకూడా రావు ఎందుచేతనంటే నీవు పొందిన వస్తువుకు చావు, పుట్టుకలులేవు. దేవుడు అంటే ఎవడోకాదు, నీకు ఎప్పడూ ఉండాలని ఉంటుంది, ఆ ఉండటమే దేవుడు. నీకు చావు అంటే ఇష్టం ఉండదు ఎందుచేతనంటే నీ స్వరూపంలో చావులేదు. దుఃఖం

వస్తే వెళ్ళిపో, వెళ్ళిపో అంటావు. దుఃఖం వస్తే నీకు నష్టంఏమిటి? మీకు స్వరూపంలో ఏదైతే లేదో అదివస్తే దానిని మీరు రిజక్టు చేస్తారు. మీ స్వరూపంలో ఏ ఆనందం అయితే ఉందో, ఏ జ్ఞానం అయితే ఉందో, ఏ శాంతి అయితే ఉందో వాటికి స్వాగతం పలుకుతారు. మనం సబ్జక్టు బాగాశ్రవణం చేయాలి, బాగా మననం చేయాలి. శ్రద్ధలేకుండా ఎవడికి జ్ఞానం రాదు. శ్రద్ధలేకపోతే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా ఏమీసాధించలేము యింద్రియనిగ్రహంలేకుండా, మనోనిగ్రహం లేకుండా మనం ఏరంగంలోను అభివృద్ధిలోనికి రాలేము. మీరు ఎగిరెగిరి పడకండి. మీకేదైనా పైసాలు కలిసివచ్చినాయి అనుకోండి, పదవులువచ్చినాయి అనుకోండి ఏదోపుణ్యప్రారబ్దం ఉంది అనుకోవాలి. ప్రారబ్దంమంచిదైనా, చెడ్డదైనా అది అనుభవిస్తే పోతుంది. ఇవన్నీ స్వప్నసమానము. అందుచేత ఎగిరెగిరిపడవద్దు, అణిగిఉండటం నేర్చుకోండి. ఎగిరెగిరిపడుతూఉంటే రజోగుణం పెరుగుతుంది. అణిగి ఉండటం నేర్చుకొంటే సత్వగుణం పెరుగుతుంది. ఏది పెంచుకోవాలో మీరు ఆలోచించుకోండి ఒకవేళ భగవంతుడు ఏదైనా మీకు అనుకూలపరిస్థితులు కలుగజేసినా అది మీ పూర్వపుణ్యాన్ని బట్టి వచ్చింది, అదేమీ నిజంకాదు. నిజం అనేది ఒకటిగానే ఉంటుంది, అది మన హృదయంలోనే ఉంది. మనహృదయంలో ఉన్న నిజంతో మనకు తాదాప్యం వచ్చేవరకు జననమరణ ప్రవాహములో కొట్టుకొనిపోతూ ఉండవలసిందే, అలా తిరుగుతూ ఉండవలసిందే. ప్రియ, అప్రియములు ఉన్నవాడు శరీరం లేకుండా ఎలా ఉండగలుగుతాడు అంటే వాడికి శరీరం వచ్చే తీరుతుంది అని చెప్పటం. లోపల రాగద్వేషములు పెట్టుకొని నాకు పునర్జన్మ రాకూడదు, పునర్జన్మ రాకూడదు అనుకొంటే పునర్జన్మ రాకుండా ఎలా ఉంటుంది, పునర్జన్మ వచ్చే తీరుతుంది. అందుచేత మనం బహుజాగ్రత్తగా ఉండాలి. నీకు ఎప్పుడైతే బ్రహ్మానుభవంకలిగిందో సంచితంలేదు, ఆగామిలేదు, ప్రారబ్దంలేదు. జ్ఞానికూడా ప్రారబ్దం అనుభవించాలి అని శాస్త్రంలో ఉంది అని భగవాన్‌తో అంటే అది చూచే వాడికి అన్నారు భగవాన్. నేను ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అని ఏజ్ఞాని అనుకోడు అలా అనుకొనేవాడు అక్కడ ఉండడు, అనుకొనేవాడు అక్కడ ఉంటే వాడికి ఆత్మజ్ఞానంకలుగదు. జ్ఞానికూడా ప్రారబ్బమును అనుభవిస్తున్నాడు అని చూసేవాడు అనుకొంటాడు. నేను ఏదో ఉద్యోగం చేసుకొంటున్నాను, దానికి రాజీనామా చేసి మీదగ్గరే ఉంటాను అని ఒక భక్తుడు చెపుతున్నాడు. మీచేతిలో ఉన్న పనివదిలేస్తే సోమరితనం వస్తుంది. కాని జ్ఞానం రాదు. నీవు చేసే పని ఇష్టంగా చెయ్యి, శ్రద్ధగా చెయ్యి, ప్రేమగాచెయ్యి అప్పుడు ప్రారబ్దం నశిస్తుంది. అంటే కొత్తవాసనలు రావు, పాతవాసనలు పోతాయి. కొంతమంది పనిచేస్తారు కాని ఎప్పుడు





విసుగ్గా ఉంటారు, మొఖంలో ఆనందం ఉండదు ఎప్పుడూ కోపంగా ఉంటారు, చిరాకుగా ఉంటారు వారికి మరణానంతరం చీకటిలోకాలు మిగులుతాయి అందువలన మనం విసుగుదల తగ్గించుకోవాలి, కోపం తగ్గించుకోవాలి. ఉద్యోగానికి రాజీనామాచేసి భగవాన్ దగ్గర కూర్చొంటాను అంటున్నావు. భగవాన్ ఎక్కడ ఉన్నాడు? భగవాన్ అంతటా ఉన్నాడు, నీహృదయంలోకూడా ఉన్నాడు. భగవాన్ నీహృదయంలో ఉన్నాడు అని గ్రహించటానికి నీవు ఉద్యోగానికి రాజీనామా చేయనక్కరలేదు ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికి పారిపోనక్కరలేదు. దేహప్రారబ్దమును బట్టి ఒకడు గృహస్థాశ్రమంలో ఉంటాడు, ఒకడు సన్యాసాశ్రమంలో ఉంటాడు. నీవు కాషాయబట్టులు వేసుకొన్నంతమాత్రం చేత నీకు జ్ఞానం రాదు. సన్యాసిఅంటే కోరికలు లేనివాడు సన్యాసి. కొంతమందికి అన్ని భోగాలు ఉంటాయి, భోగాల మధ్యన ఉంటారు, కాని ఏభోగం చేతకూడా ఆకర్షింపబడరు, వాడు సన్యాసి, నీవు ఉద్యోగం చేసుకొంటూ నీసాధనఏదో నీవు చేసుకోవచ్చు, పనిని విడిచిపెట్టనక్కరలేదు, పనికి జ్ఞానానికి విరోధంలేదు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటేమీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకొంటూ తరించండి అని చెపుతున్నారు. అయితే మీరు పారిపోయి అరుణాచలం వచ్చారు కదా అంటే అది నాదేహప్రారబ్దం, నేను అరుణాచలం వచ్చి కొత్తగా పొందిందిఏమీలేదు నేను పొందవలసింది ఏదో మధురైలోనే పొందాను అని చెప్పారు. అరుణాలం రావటం అనేది ఈశ్వరుని ప్రణాళిక నాదేహప్రారబ్దంలో ఇక్కడ ఉండవలసిఉంది, అందుకే ఈక్షేత్రానికి వచ్చాను. అంతేగాని అందరినీ సలహాలు అడిగి, ఆలోచించి నేను ఇక్కడకు రాలేదు అని చెప్పారు. గాంధీగారు ఒక మాట చెప్పారు. మీ ఇంట్లో ఎంతధనం ఉన్నా అది నీసొంతం అనుకోవద్దు, అది భగవంతుడిది అనుకో. దానికి నీవు ట్రస్టీగా ఉండు అంతేగాని యజమానిగా ఉండవద్దు. నీకుపనిఇచ్చినవాడు భగవంతుడు మీకుటుంబసభ్యులను కూడా భగవంతుడే పంపాడు వారునావారు, నావారు అని అనుకోవద్దు వారిపట్ల నీడ్యూటీఏమిటో చెయ్యి అందువలన నీడ్యూటీ సక్రమంగా చేసుకో డ్యూటీ నుండి పారిపోవద్దు, పారిపోవటం వలన జ్ఞానం రాదు. నీకు ఏదైనా కష్టంవచ్చింది అనుకో దానిని పేస్‌చెయ్యి ఆసమస్యను ఎలా పరిష్కారం చేసుకోవాలో చూసుకో అంతేగాని సమస్యనుండి పారిపోవటానికి ప్రయత్నంచేయవద్దు. నీకు తెలియకపోతే మహాత్ములు, సాధుపురుషులు ఉన్నారు వారిని అడిగి తెలుసుకో. పెద్దలను గౌరవించు, భగవంతుడిని పూజించు దానివలన కూడా దేహభావననశిస్తుంది. నీకు మనస్సుతో తాదాప్యం లేకపోతే ఎవరైనా విమర్శించినాకృంగిపోవు. మనస్సే నువ్వు అనుకొంటున్నావు, మనస్సుతో తాదాప్యం పొందుతున్నావు, అందుచేత దుఃఖం నిన్ను

వెంటాడుతోంది. ఇది గుర్తుపెట్టుకో. నీవుకాని దానిలోనుండి విడుదలపొందటమే సన్న్యాసము. నీదేహప్రారబ్దాన్ని బట్టి అనేక సంఘటనలు వస్తూఉంటాయి. ఏవో సంఘటనలు నీకు వ్యతిరేఖంగా జరుగుతున్నాయి అని కృంగిపోవద్దు. జీవితంలో ఎంతో కొంత రాజీపడటం నేర్చుకోవాలి. అంతా నీవు అనుకొన్నట్లుగా ఉండాలని అనుకోకూడదు ఇదిలోకం, లోకంలో భిన్నత్వం ఉంటుంది. ఆభిన్నత్వంలో ఏకత్వంచూస్తూ జీవించటం నేర్చుకో. అప్పుడు నీకు రాగద్వేషాలు తగ్గుతాయి. నువ్వు చూడవలసింది అక్కడ రంగునుకాదు, గుణాన్నికాదు. నీహృదయంలో ఏ భగవంతుడు అయితే అంతర్యామిగా ఉన్నాడో ఆహృదయంలో కూడా ఆయనే అంతర్యామిగా ఉన్నాడు అది చూడటంనేర్చుకో. నీవులోచూపు అలవాటు చేసుకో. లోచూపు అలవాటు చేసుకొంటే ఆత్మజ్ఞానానికి అర్హత కలుగుతుంది. ఎదుటివాడు ఎవడైనా నీకు అపకారం చేస్తే నీకు ఎంత బాధకలుగుతుందో, నీవు ఎదుటి వాడికి ఏదైనా అపకారం చేస్తే వాడికి కూడా అంతే బాధకలుగుతుంది. అందుచేత చేస్తే మంచిచేయాలి, సహాయంచేయాలి లేకపోతే ఉదాసీనంగా ఉండటం మంచిది. ఇది శ్రద్ధగాశ్రవణం చేయండి మనస్సు అక్కడపెట్టి వినండి. మనకు కోరికలేకపోతే ఆపని అవ్వదు అనుకొంటాము. నీదేహప్రారబ్దంలో ఉంటే కోరికలేకపోయినా ఆపని జరుగుతుంది. కోరికకు శక్తిలేదు, శక్తిఈశ్వరుడిది భగవంతుడు దయామయుడే కాదు నిరంకుశుడు కూడా ఎవడిదేహం ద్వారా ఏపని ఎప్పుడు చేయించాలో అది చేయిస్తూ ఉంటాడు. నీద్వారా ఒక పని చేయించాలి అని ఆయన అనుకొన్నప్పుడు నీకు ఇష్టం ఉన్నా, ఇష్టంలేకపోయినా ఆపనిజరిగిపోతుంది. అందుచేత ఈశ్వరుడు ఏపని అయితే నీకు నియమించాడో దానిని అయిష్టంగా చెయ్యవద్దు, ఇష్టంగా చెయ్యి, దేహం యొక్క ప్రారబ్దం ననుసరించి సంఘటనలు జరుగుతూ ఉంటాయి, వాటితో తాదాప్యం చెందవద్దు. మనకు ఏదైనా కోరిక ఉంటే ఆకోరికకే మనస్సు పరిమితమైపోతుంది. మనకు లోపల ఏకోరికలేదు అనుకోండి ప్రకృతితోటి సన్నిహిత సంబంధం వస్తుంది, జగత్తును కౌగిలించుకోవాలనిపిస్తుంది. దయగల హృదయమే భగవన్నిలయము అని మళయాళస్వామివారు చెప్పారు. నీహృదయంలో దయలేకపోతే నీవు మహాత్ముడివి కాలేవు, ఆత్మజ్ఞానానికి వారసుడవు కాలేవు. ఉపయోగంలేని మాటలు మాట్లాడవద్దు. కొంతమంది మాట్లాడుతూ ఉంటారు అది వారికి ఉపయోగపడదు, సమాజానికి ఉపయోగపడదు, అది ఎందుకు మాట్లాడుతున్నారో వారికే తెలియదు. ముందు నువ్వు సాధన చేసి చిత్తాన్ని సంస్కరించుకో, సత్వగుణాన్ని పెంచుకో, జ్ఞానాన్ని సముపార్జించుకో. అప్పుడు అది అందరికి పంచిపెట్టవచ్చు. నీహృదయంలో ప్రేమలేనప్పుడు, దయ లేనప్పుడు ఎవరికి ఏమి పంచిపెడతావు నీకే తినటానికి తిండి లేనప్పుడు అన్నసత్రం ఏమి పెడతావు. మనం కోపం వలన, విసుగువలన జీవితంలో ఏమీ సాధించలేము. ఆచార్యులు వారు వారి అమ్మని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆయన కోపంతో, చిరాకుతో అమ్మని విడిచిపెట్టలేదు, అమ్మ మీద ఇష్టంలేక విడిచిపెట్టలేదు. అమ్మమీద కోపం వచ్చి సన్న్యాసంతీసుకొంటే ఆయన లోకానికి జ్ఞానప్రదానం చేయలేడు. అమ్మ మీద ఆయనకు ఎంత ప్రేమ ఉందో బయటకు వచ్చి అమ్మని ప్రేమించినట్లుగా లోకాన్ని ప్రేమించాడు. అమ్మమీదకోపంతో ఇల్లువిడిచిపెడితే ఆయనలోకాన్ని ప్రేమించలేడు. అంతకుముందు అమ్మమీద ప్రేమ ఉండేది. ఇల్లు విడిచిపెట్టాక తల్లిమీద ఉన్న ప్రేమ విశ్వవ్యాప్తమయింది. జ్ఞానబోధ మనకు అవసరం. ఎన్ని భౌతికసంపదలు ఉన్నా ఆత్మజ్ఞానంగురించి పెద్దలు చెపుతూ ఉంటే దానిని శ్రవణంచేసి, మననం చేయాలి. లేకపోతే మనహృదయంలో ఆనందం ఉన్నప్పటికి అది మన చేతికి అందదు. పెద్దలు చెప్పేమాటలను శ్రద్ధగా శ్రవణం చేసివాటిని అర్ధంచేసుకోవాలి. ఆమాటలు అర్ధమయితేనేగాని వాటిని ఆచరించలేము, ఆచరిస్తేనేగాని అది మనకు అనుభవంలోనికి రాదు. మత బేధాలు ఏమీ పెట్టుకోవద్దు. మనలను ఎవరూ ఇతరులు బంధించటంలేదు. మనరూపంమనలను బంధిస్తోంది, మననామం మనలను బంధిస్తోంది. ఈనామరూపములనుండి విడుదల పొందితే నదివెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా ఇప్పుడే మనం హృదయసాగరంలో ఐక్యమవుతాము.

మీ జీవితంలో ఏసంఘటన జరిగినా దానివలన మీకు దుఃఖం రావటం లేదు. ఆసంఘటనకు మీరు రియాక్టు అవ్వటం వలన మీకు దుఃఖం వస్తోంది. ఈఒక్కమాట మీరు గుర్తుపెట్టుకోండి ఈచిన్నవాక్యాన్ని మీగుండెలో నిలబెట్టుకోగలిగితే, దానిని మీరు సొంతం చేసుకోగలిగితే సాధనతో నిమిత్తం లేకుండా ఇప్పుడే ఇక్కడే మీకు దుఃఖం నశిస్తుంది. ఈచిన్నవాక్యాన్ని అర్ధంచేసుకోవటానికి ప్రయత్నంచేయండి. అర్ధంచేసుకోవటంకూడా యోగంతో సమానము. మీకు అవగాహన అవ్వకపోతే అభ్యాసంచేయలేరు. మీకు ఎంతవరకు అర్థమవుతోందో, ఎంతవరకు మీగుండెకు తాకుతోందో అంతవరకు దానిని మీరు ఆచరించగలరు.

20-08-2003

రమణ భాస్కర

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 26-08-03 | మంగళవారం | పత్తేపురం (వయా) చేబ్రోలు |
| 31-08-03 | ఆదివారం | చింతపర్రు (వయా) పాలకొల్లు |

## శరణాగతి

అహంకారము (వ్యక్తిభావన) తన మూలంలో ఉన్న సద్వస్తువుకు తన్ను తాను సమర్పించుకొని కరిగి పోవుటయే శరణాగతి. దేహాత్మబుద్ధిని వదల్చుకోవటమే నిజమైన శరణాగతి. ఆత్మకు భిన్నముగా అహంకారమునకు ఉనికి లేనప్పటికి, అజ్ఞానము వలన అహంకారము కర్తగా నటిస్తూ, స్వతంత్రమైన దానిగా ప్రవర్తిస్తూ వుంటుంది. గురువు అంతర్యామిగా స్వరూపంగానే ఉన్న కారణంగా మన అహంకారము ఎంతవరకు నశించింది? ఎంత వరకు మిగిలి యున్నది? అన్న అంశమునే చూస్తారు, అంతేకాని బాహ్య చేష్టలకు మోసపోరు. అహంకారము ఎంతవరకు తగ్గితే అంతవరకు ఒక వ్యక్తి తనకు తాను గాని, అట్లే సమాజమునకు గాని ఉపయోగపడగలడు. శరణాగతి పూర్ణమైనప్పుడు కర్తృత్వ భావన నశిస్తుంది. "వేరుభావన" నశిస్తే చేయు కర్మలు, వాటి తాలూకు ఫలితాల గురించి ఆందోళన లేకుండా ఈశ్వరుని చేతిలో పనిముట్టు ప్రాయుడుగా వుంటాడు, "నేను - నాది" అను భావన నుండి విడివడతాడు. దేహప్రారబ్ధం ప్రకారం ఎటువంటి సంఘటనలు జరిగినా ప్రతి చిన్న విషయం కూడా ఈశ్వరాజ్ఞ ప్రకారమే జరుగుతుందనే ధృడసంకల్పంతో ఈశ్వరుని పట్ల కృతజ్ఞతతో వుంటాడు. అప్పుడు ఆదేహముద్వారా అద్భుతకర్మ జరుగుతుంది. సర్వకర్త "పరమాత్మయే", అనగా జరిగేది, అద్భుతమైనది పరమాత్మ సంకల్పమే! వ్యక్తిగా నేను లేను కావున నాకు ప్రత్యేక సంకల్పం ఏమియు లేదను షరతులు లేని పరిపూర్ణ నిశ్చయమే పూర్ణ శరణాగతి. ఇట్టి శరణాగతి పొందువానికి "ఆత్మజ్ఞానం" కలుగుతుంది.

చావలి సూర్యనారాయణ మూర్తి
టీచర్, అమలాపురం

20-08-2003



ది. 8-8-2003 శుక్రవారం మధ్యాహ్నం మార్టేరు గ్రామంలో
శ్రీనాన్న సూపర్ బజార్ ను ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు

## రమణ భాస్కర పక్షపత్రిక సంవత్సర చందా రు. 150/-

సంవత్సర చందాకు ది॥ 23-9-2003 నుండి ది॥ 22-9-2004 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు పంపబడతాయి. మీరు యం.ఓ. / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా.

**పెన్మెత్స శ్రీరామరాజు**
**("రమణభాస్కర" కొరకు)**
**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**

పేరు .................................................... తండ్రి / భర్త

.................................................... డోర్ నెం ....................

వీధి / రోడ్ నెం .................................... గ్రామం ....................................

పిన్ కోడ్ .................... మండలం .................................... జిల్లా

.................................... డి.డి. / యమ్.ఓ. / నగదు వివరాలు ....................

ఫోన్ నెం....................